# సాయిరాం

# శ్రీ సాయినాథాయ నమ:

గొలగమూడి
17-12-1998

శ్రీమతి భవానీ గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం.

మీ లెటరు చేరినది. ముందు మనం కృషి చేయాలి. తర్వాత శ్రీ స్వామి వారి ఆశీస్సులు లభిస్తుంటాయి. వారెంతో కరుణామయులు. మనం వారిని స్మరించని కాలంలో గూడా వారు మనతో ఉండి మనలను కనిపెడుతుంటారు. కానీ నిరంతరం మనతో ఉంటూ మనలను కష్టసుఖాలలో వెంటనంటే దైవాన్ని వదలి మనం అన్ని విధాలా బాగున్నపుడు వాళ్ళ స్వార్థానికి ఉపయోగపడుతున్నప్పుడు మాత్రమే మనతో వుండే స్నేహితులు, బంధువులను మాత్రమే చేరుతుంటాము. వారితో స్నేహము చేస్తుంటాము. ఆ మాత్రం దైవంతో స్నేహం చేయలేము. ఇదే మాయ.

మొదట మనం మనకొరకు బ్రతకటం నేర్చుకోవాలి. 100 కి 100 మంది ఇతరులు మనలను గూర్చి ఏమను కుంటున్నారో గనుక వారు మనలను గురుంచి మంచి అభిప్రాయం కల్గి వుండేటట్లు జీవించ ప్రయత్నిస్తూంటారు. అది చాలా తప్పు. మనం ఇతరులను గూర్చి ఎంత విమర్శించినా పరోక్షంగా దూషించి తప్పులు వెదికి వారిని దూషించినా మననోరు బుర్రలు చెడిపోవడం. మనం బాబాగారి ఆజ్ఞలు తప్పడం తప్ప ఆ వ్యక్తులు ఏమైనా బాగుపడతారా? లేదు. వాళ్ళు బాగుపడతారో చెడిపోతారో మనకు అక్కరలేదు. వాళ్ళను విమర్శించి పాపం మూటగట్టుకొంటున్నాము. మానవుడు ఈ దుర్గుణం ఉన్నంత వరకూ అతని పాపం పెరుగుతూనే వుంటుంది. దాని ప్రభావం వలన మానవులు తెలియకుండానే తన కష్టాలను తానే తెచ్చుకుంటాడు.

నేను కూడా మా హెడ్మాష్టరు టీచర్సును గూర్చి వారులేని సమయాలలో విమర్శిస్తుండేది. ఇతరులు నిందుస్తుంటే ఆశక్తిగా వినేవాడ్ని. నాకు ధ్యానం కుదరలేదని పూజ్యపాదులు ఆచార్య భరద్వాజ మాష్టర్ గారికి చెబితే వారు ఒక్కటే మాటన్నారు. "వాళ్ళు లేకుంటే నీవు బ్రతకలేవా?" అని.

నిజంగా నేను బడిలో చదువు చెప్పినందుకు జీతమిస్తున్నారు. కానీ అందరిని గూర్చి విమర్శించి, విమర్శలు వినినిందుకు కాదుగదా? వీళ్ళ కోసం బాబా మాటనతిక్రమించి పంది మల భక్షణం చేయడం వంటి విమర్శలు మానివేయ తలపెట్టినాను. అంతే ఇక నా డ్యూటీ నిర్వహణలో నిమగ్నమై వారికి దూరంగా

**కాకదృష్టి:** కాకికి రెండు కండ్లున్నట్లు మనకు కనపడినా నిజానికి వానికి ఒక కన్ను కనబడదు. ఒకే కంటితో ఎంతో జాగ్రత్తగా చూస్తుంది. అలాగే మన దృష్టికూడా. ఒక్క చదువు పైననే ఉండాలి. ఇక కుంటుంబ విషయాలు, స్నేహితుల విషయాలు, ప్రపంచ విషయాలు దగ్గరకు రాకూడదు. అప్పుడే సరస్వతి మాత మనలను వరిస్తుంది.

**బకధ్యానం:** బకము అంటే కొంగ. నీటిలో ఒంటికాలిపై నిలబడి ఉండి తన కాలుదగ్గరకు వచ్చిన చేపను టపీక్కుమని పట్టుకుంటుంది. మనం కూడా మన ధ్యాసంతా చదువుపైన ఉంచితే వద్దన్నా చదువువస్తుంది.

నాకుమార్తె 10 వ తరగతి చదివాక చదువు వద్దంటే వద్దన్నాను. ఆమెకు చదువు పిచ్చి. బాగా చదివిస్తే అంతకంటే ఎక్కువ చదివిన అల్లుడిని వెతకాలని ఎక్కువ కట్నం ఇవ్వలేం గనుక పెద్ద చదువులు చదివిన వాళ్ళను తేలేమని నిర్మొహ మాటంగా చెప్పేశాను. ఆమె ప్రయివేటుగా Open University కి కట్టి B.Com పాసయింది. C.A.HIB పాసయింది. Bank entrance test పాసయింది interview లో select అయి ఇప్పుడు బాంకులో State Bank of India లొ పని చేస్తుంది. ఆమెకు గుడ్డలు, తిండి అక్కరలేదు. స్నేహితులు అక్కరలేదు. తనను కదిలించకుండా చదువుకోనిస్తే చాలు, కొన్ని విషయాలలో ఆమెను నేను గురువుగా స్వీకరిస్తాను.

కవరులో పేనా పంపడం వీలుకాదు. రీఫిల్ పంపు తున్నాను. అక్కడికి చేరేసరికి పనిచేస్తుందో లేదో సరిగా వ్రాయ కుంటే అది అశుభమని తలచవద్దు. శ్రీ స్వామివారి సమాధికి తాకించే పంపుతున్నాను.

ప్రస్తుతం పారాయణలు అవసరంలేదు. నిత్యం 10 నిమిషాలు గాని 15 నిమిషాలుగాని పూజ చేసుకో చాలు. బాబా చెప్పిన పని చేయకుండా మనకిష్టమొచ్చిన పని చేయకూడదు. బాబా మనకు చదివే పని ఒప్పగించారు. ఆపని సక్రమంగా నెరవేర్చుకోవాలి గదా. దోవన నడుస్తున్నప్పుడు, ఎప్పుడు తీరికగా ఉన్నప్పుడు పట్టుదలగా వారి నామం చేసుకుంటే చాలు. ఓర్పు, సహనం, ఇతరులకు మంచి చేయడం అన్నీ నిదానంగా అవే వస్తాయి. ముందు మనం చదువులో మినిగిపోవాలి. అందుకు ఆహారనియమం పట్టుదల అవసరం. మనం చేయవలసిన కృషి చేస్తే బాబా కృప తప్పక కలుగుతుంది. కృషితో నాస్థి దుర్భిక్షం అన్నారు. కృషి చేసిన వారికి కరువే ఉండదని భావం.

మానవుని ప్రథమ శత్రువు సోమరితనం. దానిని తరిమేందుకు తీవ్రమైన పట్టుదల శ్రద్ధ ఉండాలి. తీవ్రమైన అని మహర్షులు ప్రయోగించారు, దాన్ని సాధించిన వారికి తిరుగులేదు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పె.సుబ్బరామయ్య

ఓమ్

గొలగమూడి
24-11-2000

చిరంజీవి సాయిశివ గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం. 3.00 రూ కవరు పంపావు అది లాభమే తెల్లకాగితాలు ఎందుకు దొరా? ఎంత తింటే మితాహారమో ప్రక్కన మరొకరు చెప్పడం కష్టం. ఎంత వరకు తింటే ఆకలి తీరి ఇంతకు ముందు కంటే హుషారుగా పని చేయగలుగుతామో అది మితం అంటారు మాష్టారు. అన్నం తిన్నాక భుక్తాయాసం ఉండకూడదు, పడుకోవాలనిపించకూడదు అని చెప్పేవారు.

రాత్రిపూట తినేటప్పుడు చాలా బాధగా ఉందన్నావు. కొద్దిగానే తిను. మరలా ఆకలైతే చన్నీటిలో కలిసే పాలపొడి ఉంది. చన్నీళ్ళలో చక్కెర పాలపొడి కలిపి రెండు మూడు మార్లు త్రాగు. బాగా ఆకలైతే రెండు మూడు బిస్కెట్లు తిను. అవి కాకుంటే నీకు ఇష్టమైన పండ్లు తిను. పాలు చల్లగా త్రాగడం కష్టమైతే చిన్న (బుల్లి) కిరోసిన్ స్టౌ పెట్టుకొని ఒకే ఒక గిన్నెలో వేడిచేసుకొని త్రాగు.

రూములో చాలామంది ఉన్నారా? మీరిద్దరేనా? అంత మందిలో ఇలాచేయడం కష్టమనుకోకు. నేను P.U.C. చదివేటప్పుడు మా హాస్టలులో నలుగురం P.U.C. చదివితే నేనొక్కడినే పాసయ్యాను. సంవత్సరం పొడుగునా నన్ను పుస్తకాల పురుగు అని హేళన చేశారు. చివరకు ఏడ్చారు. మన ధ్యేయం గమ్యం దృష్ట్యా ఇలాంటి వాటినన్నింటినీ లెక్క చేయకూడదు. ఇదే కాకదృష్టి అని విధ్యార్థి లక్షణం చెప్పింది.

మనలను సాయి యుద్దానికి పంపారు. చక్కగా యుద్ధం చేయాలా లేక ఆయనను స్మరిస్తూ ఉండాలా? రోజులో ఒకటి రెండు సార్లు పదినిమిషాలు కడ్డీలు వెలిగించి కష్టసుఖాలు ఆయనకు చెప్పుకోవడమొక్కటే గాని మిగిలిన కాలమంతా మన చదువే మనకు ధ్యేయం కావాలి. అనవసర బాతాఖానీలు చేయడం తప్పు. అనవసర భక్తి పుస్తకాలు చదవరాదు. చదువు పూర్తయితే deep గా చదవవచ్చు. ఆలోచించవచ్చు. ఇప్పుడు సాయి మనకిచ్చిన పని మాత్రమే మనం నెరవేర్చడం ఒక్కటే మన ధ్యేయమవ్వాలి. అప్పుడు సాయి మనలను మెచ్చుకుంటారు. అట్లాగాకుండా ఆయన కథలు చదువుతుంటేనే ఆయన సంతోషించేవాడయితే ఆయన రాజకీయనాయకుల కంటే హీనుడని చెప్పాలి.

నీ సెమినార్స్‌లో గాని ఏ కార్య క్రమాలలోనైనా, నీ శక్తినంతా ఉపయోగించి కృషిచేస్తుండు. సాయి భక్తి తగ్గి పోయిందనుకోకు. భక్తి అంటే ఏమిటి పూజ, పూలు, నైవేద్యాలు, స్తోత్రాలు హారతులా? కానే కాదు. అర్జునునకు శ్రీ కృష్ణుడు బోధించినదే నిజమైన భక్తి. Fight like a true warrier. మనలను గూడా అదే చేయమంటున్నారు. సత్యం, ధర్మం తప్పవద్దన్నారు. ధర్మం అంటే ఏమిటి, ఎవరి ధర్మం వారు నెరవేర్చడమే.

నీవు విద్యార్థి ధర్మాలు పాటించాలి గాని భక్తుని లక్షణాలు కాదు. నీ చదువు పూర్తయ్యాక పూజలు, హారతులు, పారాయణలు. Not now. నీవిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనే బుద్ధికుశలత అనుగ్రహించు తండ్రీ అనే ఒకే ఒక ప్రార్థన మాత్రమే. అన్ని జీవులలో ఆయనే ఉన్నాడనే భావం మరచిపోకుండా తగువిధంగా నడుచుకోవడం. అయ్యో ఇలా చేశానే అనే మనస్తాపం రాకూడదు. ఎదుటివాని ప్రాప్తం అలా ఉండి అలా బుద్ధిపుట్టించాడని dashing గా పోతుండాలి. అంతేగానీ చిన్న చిన్న విషయాలు అతిగా పట్టించుకోకు. మన ధ్యేయం చదువు - పరీక్షలు. దృష్టి సాయి మీద పెట్టి సాగిపోతుండు. అది తినాల ఇది తినాల అనే మాటలకు fruits & fruit juice మాత్రమే solution. Room mates ను గూర్చి పట్టించుకోకు. Room mates ఎక్కువగా ఉండకుండ - ర్చయినా మీరిద్దరే ఉండేటట్లు చూచుకో.

ఆయనను మెప్పించేతుకే నేను చదువుతున్నాను అనే ఒక్క భావం ఎల్లప్పుడు మరచిపోకుండా ఉండు. Seminar అయిపోగానే ప్రక్క దోవ పోకుండా నీకు నీవే ధ్యాస నిలుపుకోవాలి. విద్యార్థి లక్షణాలు నిత్యం మననం చేస్తుండు. శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ.

**మితాహారం, జీర్ణవస్త్రం, కాకదృష్టి, బకధ్యానం - విద్యార్థి లక్షణాలు**

మీ

పె.సుబ్బరామయ్య

